
# ఇది ప్రశ్న - అది జవాబు



దీపావళి కథలపోటీలో బహుమతి రూ. 600/- పొందిన కథ

## శివయ్యగారు చెప్పటం పూరిచేసి కళ్లు మూసుకున్నారు.

చావు బ్రతుకుల సంధి సమయంలా దురూహ్యమైన నిశ్శబ్దం అలముకుంది. నేను చుట్టూ చూసేను. పాతకొంప. నిజానికది ఇల్లన్నటానికి వీల్లేని కొట్టడి. చూరు పెంకులు రాలిపోయినె. కప్పునిండా కంతలు. ఆ కంతలో నుంచీ ప్రవేశించిన వెలుతురు మాత్రం అక్కడక్కడా నేలమీద వలయాలు సృష్టిస్తోంది.

నిన్న రాత్రి కురిసి వెలిసిన వాన చినుకుల వలన నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. నిట్రాటికి దూలానికి ఒక దీపం బుడ్డి - శివయ్య గారి జీవితాన్ని సూచిస్తూ — పొగచూరి పోయి వుంది. ఒక మూల రెండు అల్యూమినియం గిన్నెలు, ఒక రాగి చెంబు, ఒక రాగి హరివాణం, దానిలో ఒక రాగి ఉద్ధరిణె, వీటికి ప్రక్కగా వో జాజి చెక్క పెట్టె.

దానిమీద చిరిగీ, చివికిపోయిన పుస్తకాల దొంతరలూ, వాటిల్లో నుంచీ బయటికి చొచ్చుకొస్తున్న వూడిపోయిన కాగితాలు. చూరుకు వ్రేలాడదీసిన దణ్ణెంమీద ఆరేసిన ఒక నీర్కావి పంచె. రెండు అంగవస్త్రాలు — అన్నీ మాసికలు వేసిన బతుక్కి తార్కాణాలుగా నిలిచి వున్నై.

ఆయన పడుకున్న నులక మంచం మీద వెలిసిపోయిన శాలువా పరచి వుంది. మురికి పట్టి మకిలిగా వుంది తలగడ. మంచం క్రింద తల వైపు వో చిన్న మందు సీసా, నాలుగు మందు పొట్లాలూ వున్నై.

శివయ్యగారు ఈ వైపు తిరిగేరు. ఆయనకి ఎగశ్వాసగా వుంది.

వణుకుతున్న పెదవులతో మళ్లీ మాట్లాడసాగేరు. "కళ్ళు మూసుకున్నా, తెరచినా ముంపు వచ్చిన ఏరూ; తగలబడి ఆరిపోయిన ఊరూ; ఏనుగులు తొక్కేస్తున్న అంటి తోటే కనబడుతున్నయ్‌రా రాజా! ఆమ్మో! నా గుండెల మీద ఎవరో ప్రళయ తాండవం చేసేస్తున్నారు. నా నరాలన్నిటినీ గుప్పిట్లో బిగించి పిండేస్తున్నారు. నేను చచ్చిపోతున్నాను ... అబ్బా" అంటూ మూలిగేరు. రొప్పు ఎక్కువైంది

నాకు కుమ్ము పొగలో కూర్చున్నట్లయింది ఆందోళనలో పడ్డాను. ఆయన మీదికి వంగి గుండెలమీద అరచేతో నెమ్మదిగా నిమురసాగేను. పక్కింటి సుభద్రమ్మ లోపలికొచ్చి కూర్చుంది.

క్షణాల తర్వాత ఆయన మళ్లీ మొదలెట్టేరు. ఎండుటాకుల మీద తొండ పరిగెడుతుంటే అయ్యే ధ్వని వెలువడుతోంది —ఆయన కంఠం లోంచీ

"నేను బ్రతకను, నాకు తెలుసు. ఈ మాయదారి రోగం నా ప్రాణం తీయటానికే వచ్చింది. నువ్వే నన్ను రక్షించాలి. నిలాగైనా సరే నాకు ప్రాణభిక్ష పెట్టాలి."

ఆయన కళ్లలోకి చూసేను. వీళ్ళు పేర్కొని వున్నై. నాకు ఏమీ పాలు పోవడం

లేదు. మాటలు కూడగట్టుకుని అడిగేను, "ఆచార్యులగారిని పిలుచుకురానా ?" అని.

ఆయన తల అడ్డంగా తిపేరు. ఉస్సు రన్నారు. "ఉహూఁ ఈ మాయదారి రోగాన్ని నయం చెయ్యడం ఆయన వల్ల కాదురా నా ప్రాణం మీద ప్రయోగం చేస్తున్నాడు ఆయన ప్రయోగాలకి బలై పోతానని నాకు భయంగా వుందిరా, నన్నెట్లాగైనా బతికించి పుణ్యం కట్టుకో."

ఆయన పరిస్థితి చూస్తుంటే నాకు మనస్సులో పునాదులు కుంగిపోతున్నట్టయింది — గుటకలు మింగుతూ అడిగేను, "పోనీ పట్నం పోదామా ? అక్కడెవరన్నా మంచి డాక్టరుకి చూపించవచ్చు"

శివయ్యగారి కళ్ళల్లో వెలుగు ప్రవేశించింది.

"అయితే నేను యిప్పుడే వస్తాను" అంటూ లేచాను

"త్వరగా వస్తావు కదూ ?" అంటూ జాలిగా నా వైపు చూశారు ఆయన. "ఊఁ" అంటూ బయటికి నడిచేను.

శివయ్యగారిలో తాటి ప్రమాణంగా పెరిగిన చావు భయాన్ని చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆయన జీవిత గమన మంతా నా కళ్ళముందు మెదిలింది.

ఇరవై ఏళ్ళ క్రిందట మా నాన్న పోయారు. అప్పటికి ఆయన వయస్సు ఏభై ఐదు. ఆయనా, శివయ్యగారూ సుమారు ఒకే వయస్సు వాళట అంటే ఆయన కిప్పుడు ఏ డెబ్భై అయిదో వుండాలి. శివయ్యగారికి మొత్తం పదకొండు మంది సంతానం కలిగేరు. అయితే, ఆయన దురదృష్టం ఏ వొక్కరినీ సజీవంగా నిలుపుకోలేక పోయింది. పదిహేనేళ్ళ క్రితం భార్య కూడా పోయింది.

నడి వయస్సులో ఆయన మా వూళ్ళో వాళ్ళకి సిరిపురం బావి నుంచీ మంచినీళ్ళు తెచ్చిపోస్తూ జీవనం గడుపుకున్నారు. సిరిపురం మా వూరికి క్రోసు దూరం. మా వూళ్ళో త్రాగే నీటి యిద్దడి జాస్తిగా వుండేది. ఇప్పుడు కొళాయిలు వచ్చినై.

వయస్సు మళ్ళిన తర్వాత శివయ్యగారు నాగేశ్వరస్వామి ఆలయంలో పురాణం చెప్పడం మొదలెట్టారు. పురాణం చెప్పేటప్పుడు ఆయన గీత మంచీ, రామాయణ, భారత, భాగవతాల్లోనించీ, ఉపనిషత్తుల్లోనించీ, వేదాల్లోనుంచీ విస్తృతమైన ఉదాహరణలతో వేదాంత సారాన్ని పిండి బోధించేవారు. "శివయ్యగారి పురాణం ఈ వూరిని మరో వెయ్యేళ్ళు "గొంగళి" గానే వుంచుతుంది" అని కుర్రకారు ఈసడించుకోవడం కూడా నాకు తెలుసు

ఊళ్ళో ఏ శుభకార్యం జరిగినా, అశుభం జరిగినా ఆయనే కర్మకాండలు చేయించేవారు. గ్రామంలో ఎవరు చనిపోయినా శవవాహకుల్లో విధిగా ఆయనొకడిగా వుండేవారు. చిన్నపిల్లలు పోతే వాళ్ళని బుజాన్న వేసుకుని పోయి అంతా అయిపోయిందనిపించేవారు. అలా మరణానికి అతి సన్నిహితంగా మెలగి, మరణించిన వారికి విడరాని బంధువై — అంతటి అనుభవాన్ని గడించిన శివయ్యగారికి తాను చచ్చిపోతానని ఇంత భయమేమిటా? అని వితర్కంలో పడ్డాన్నేను.

అంతేకాదు, అశుభాలలో గరుడ పురాణం చెప్పేవారు. ఆయన పలకరింపుల పరిహాసంలో తప్పనిసరిగా ఉదహరిస్తూ వుండే— 'జాతస్య మరణం ధృవమ్'— సూక్తి ఎక్కడికి పోయినట్టు? అంతటి వేదాంతాన్నీ వొంటబట్టించుకున్న శివయ్యగారికి చావు భయం!

కుదుట్లో బిండిపోతున్న చెట్టు కొత్త కొమ్మలు వేయాలనే కోరిక ఏమిటి?

నాకు చన్పున నా మిత్రుడు సత్యం వాళ్ళ అమ్మ నిన్న సాయంత్రం అన్న మాటలు గుర్తుకొచ్చినై. "అయినా రాజా— ఆయన గురించి నిందుకు అంత ఆదుర్దా పడతావ్? ఆయన ఎవరికోసం బతకాలి? పెళ్ళాం, పిల్లలు లేరు. తన అన్నవాళ్ళు ఒక్క నలుసు కూడా లేదు. ఊరి జనానికి బరువు తగ్గుతుంది. రోజూ ఎవరో ఒకరు విస్తరి వెయ్యాల్సిందేగా—"

ఆమె మాటలకు నా మనస్సు చివుక్కుమంది. అయినా, ఆమె అన్నదీ నిజమే. అలాంటి పరిస్థితిలో వున్న శివయ్యగారికీ చావు భయం.

డెబ్బయి ఏళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో ఆయన ఈ మజిలీ తప్ప మరో మజిలీ నిరుగరు. పట్నానికి పోయినా రాత్రికి ఇంటికే వచ్చేవారుట. పగలల్లా పొట్ట నాయగట్టుకుని రాత్రికి ఏ అన్నపూర్ణమ్మ ఇంటికో వెళ్ళి అరుగుమీద బైఠాయించేవారు. ఇక ఆ తల్లి పీట వేసి విస్తరి వేయాల్సిందే!

"సినిమా తిరుగని జీవి, హోటల్ గడప తొక్కని మనిషీ—" ఈ కాలంలో ఎవరున్నారు— మా శివయ్యగారు కాక!

అసలు ఆయన అవతారమే చిత్రమైనది. మనిషి చాలా ఎత్తరి. జుట్టు ముడి, విబూది కట్లు, చెవులకి కమ్మలు, నీర్కావి పంచె కట్టు, పైనో అంగ వస్త్రం. గళం మాత్రం అనర్గళం.

నిదానంగా ఆలోచిస్తే ఆయన పురాణ ప్రభావానికంటే ఆయన వాక్చాతుర్య ప్రభావానికి లోనైన మనుషుల్లో నేనూ ఒకణ్ణని చెప్పుకోవచ్చు. అందుకే ఆయనకి సన్నిహితమైనా నమకుంటాను.

ఆయన తన చిన్ననాటి ముచ్చట్లూ, చిత్ర విచిత్రమైన అనుభవాలూ హాస్యంగా చెపుతూ వుంటేవినటానికెంతో బాగుంటుంది. ఒకసారి నాటకంలో రామనాథశాస్త్రి స్టేజి మీద రాగం తీస్తుంటే ఈయన జనంలో నుంచీ పిల్లి కూతలు వేయడం, స్టేజిమీద మరో నటుడి పంచె వూడిపోయి గలభా జరగటం వంటి విశేషాలు చెప్పేవారు.

వొకసారి పెళ్ళి వూరేగింపు పోతుంటే పల్లకీలోకి కొంటెవాడెవడో రాయి విసిరేట్ట. పెళ్ళికూతురేమో ఒకటే ఏడుపుట. పెళ్ళి కొడుకు 'ఉష్, ఉష్' అంటూ ఆమెను సముదాయించాడుట. ఇది చెప్పి పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వేవారు. పిల్లలకి పరటలు పెట్టి పెళ్ళిళ్ళు చేసినట్లే గేలి చేసేవారు. చిన్న పిల్లాడిలా పసి పిల్లల్నిచమవుగా దగ్గరకు తీసి 'లంజా-లమీ' అని పరాచికాలాడేవారు.

ఒకసారి రామనాథంకీ వెంకటయ్యకీ చేనిగట్లు తగాదా వచ్చింది. క్షణంలో ఊరంతా రెండు పార్టీలై పోయింది. రావి చెట్టు కింద పెద్ద గలాటా మొదలైంది. అది చినికి చినికి గాలివానైంది. కుర్రకారు పౌరుషంతో ఉడికి పోతున్నారు. మాటలు ఈ పెల్ని ప్రయోగించు కుంటున్నారు.

ఆ ఉద్రిక్తతలోకి అడుగు పెట్టారు శివయ్యగారు. ఇరుపక్షాలనీ సముదాయించబోయారు. కానీ ఎవరూ వినే స్థితిలో లేరు.

వెంకటయ్య కొడుకుది మరీ దూకుడు స్వభావం. "నువ్ పక్కకి పో పయ్యా పంతులూ, నీ కెందుకీ మధ్యవర్తిత్వం" అన్నాడు.

ఎవరో ఏదో అన్నారు. తప్పుకోమంటే తప్పుకోమని శివయ్య గారి మీది కొచ్చాడు అతను.

ఈయన నిండు కుండలా నిలబడ్డారు.

## శుభాకాంక్షలు

బెల్లంపల్లి, మందమర్రి ఆంధ్రపత్రిక పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు


**కె. స్వతంత్రరెడ్డి,** ఏజంటు, ఆంధ్రపత్రిక, బెల్లంపల్లి.

## శుభాకాంక్షలు

బెల్లంపల్లి, మాదారం ఆంధ్రపత్రిక పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు

**ఎ. వెంకటేశ్వర్లు,** సివిల్ కాంట్రాక్టర్,

ప్రకాశ్ పౌల్ట్రి ఫారం కొత్త ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్, బెల్లంపల్లి




## ఇది ప్రశ్న—అది జవాబు

"ముందు నీ తల లేచిపోతుంది జాగ్రత్త" అంటూ బెదిరించాడు అతను; వెంటనే గడ్డపార లేచింది.

శివయ్యగారి కంఠం ఖంగున మ్రోగింది; "ఎన్ని చావులు చూశానురా నేను, నన్ను చావు పేరు చెప్పి భయపెడదామనుకుంటున్నావా ? నేనెవరో తెలుసుగా ... శివయ్యని. చావుకీ నాకూ అవినాభావ సంబంధం వుంది. చావంటే పారిపోయే పిరికి వెధవని కాదు. రా..." అని అడుగు ముందుకు వేశారు.

అర్ధరాత్రికి గానీ ఆ తగాదా తేలేదు. శివయ్యగారి ధైర్యం మర్నాడు మా అందరికీ చర్చనీయాంశమైంది.

అలాంటి శివయ్యగారు చచ్చిపోతానని భయపడిపోతున్నారు. చిత్రంగా వుంది !

నేను ఆచార్లు గారిల్లు చేరుకున్నాను.

నే వెళ్ళేసరికి ఆయన కల్వం ముందు పెట్టుకుని ఏదో మందు నూరుతున్నారు. శివయ్యగారి పరిస్థితి వివరంగా చెప్పాను

ఆచారి గారు చిత్రంగా నవ్వేరు. "మాడు రాజూ, శివయ్య వింత జీవితం గడిపేడు. నిజానికి శవవాహకత్వం అతని వృత్తి అయిపోయింది. అతనికి చావు భయం ఏమిటి ? ఎందుకు ? ఈ దరి నుంచీ ఆ దరిదాకా ఆయన సాగించిన ప్రయాణంలో వెంట ఎవ్వరూ లేరు ఎవరికోసం— లేదా – ఎందుకోసం బతకాలిట ఆయన ? ఏమంటావ్.. ?"

నేనేమంటాను. నా ఆలోచనలకు అంతు లేకుండా వుంది. చెరువు గట్టున నిలబడి అనంత ఆకాశంలోకి చూస్తున్నట్టు వుంది. శివయ్యగారు తనని పట్నం తీసుకు వెళ్ళమంటున్నట్టు చెప్పాను.

ఆచారు గారు మర్మ గర్భంగా నవ్వేరు. "పెనం మీద వేగిన గింజను విత్తుగా నాటి మొక్కగా మార్చలేవు రాజూ. ఆయన పోతే భూదేవికి ఏం మునిగిపోతుందిటా ఇప్పుడు?" ఈయన గద్దించటం మొదలెట్టాడు

"ఆయన కాళ్ళూ చేతులూ మాట వినడంలేదు. ఒళ్ళు నీరు సూపింది. నిశ్వాస చాలా ఎక్కువగా వుంది. మీరు ప్రస్తుతం ఆయన వైద్యులు గదా అని వచ్చాను. ఏదో ఒకటి చేయాలి గదా? తనను ఎలాగైనా బ్రతికించమని ప్రాధేయపడుతున్నాడు. ఒక జీవి అలా అలమటిస్తుంటే

మనకేమీ పట్టనట్లు వదిలేయడం ఎలా ?" కొంచెం విసుగ్గానే అడిగాను

ఆయన నిట్టూర్చాడు. "శివయ్య గుండె ఉబ్బరించింది. ఎక్కడికి తీసుకు వెళితే నా బతుకుతాడని నాకేం నమ్మకం లేదు, ఆ తర్వాత ... నీ యిష్టం, నీ కలా తోస్తే అలా చెయ్యి."

ప్రెసిడెంటు గారింటికి పరిగెత్తాను. ఆయనకు కారుంది. వెళ్ళి పరిస్థితి చెప్పాను, కారు కావాలనీ అడిగేను.

"నువ్వు నాకు కావలసిన వాడివని చెప్తున్నాను, ఆ వొంటికాయ శొంఠికొమ్ము కోసం నీ ఆత్రుత ఏమిటోయ్. అయినా, ఒకమాట అడుగుతాను చెప్పు. శివయ్య ఏ వాడన్నా ఏవరి విషయంలోనైనా పట్నం పరిగెత్తుతాడా మనాడా ? ఆలోచించు. పైగా ప్రాణం పోయే జబ్బుకైనా ఆచార మందే అమృతం అని గదా ఆయన విశ్వాసం. తలనొప్పి – తన దాకా వస్తేగాని తెలీదు మరి. అయినా – ఇప్పుడాయన బతికి ఎవర్ని ఉద్ధరించాలిట. నా కారు ప్రస్తుతం నడిచే స్థితిలో లేదు. చాలా రిపేరు చేయించాలి"

నేను మరేం తర్కించకుండా వచ్చేసాను. శివయ్యగారు ఎలా వున్నారో అని కడుపులో ఆందోళన ఎక్కువైంది నాకు. ప్రెసిడెంటు గారి మేడని చుట్టి రోడ్డున రాకుండా – వాళ్ళ దొడ్లో నుంచీ మునసబుగారి పాముల దొడ్డి దాటి మా యింటికి వచ్చేశాను.

మా ఆవిడ – రమకి – పరిస్థితి చెప్పాను. అమ్మా, అన్నయ్యా ఇద్దరూకూడా విన్నారు.

రమే అన్నది, "కారు లేకపోతే ఎడ్లబండి మీద తీసుకు వెళ్తారనుకోండి. అయినా ఆ ముసలాయన గురించి మీ ఆందోళన ఏమిటి? పోనీ, హాస్పిటల్‌లో చేర్చారే అనుకోండి. ఆ తర్వాత ఏంతవుతుందో ఏమిటో – డబ్బు సంగతీ చూసుకోండి. మనదేమీ వెనకా ముందూ చూసుకోనక్కర్లేని సంసారం కాదు గదా! మనకూ నలుగురు బిడ్డలున్నారు, బాధ్యత లున్నాయి. ఆ పైన మీ యిష్టం."

ఏడేడు సంద్రాల్ని – నా ముందు నిలిపి తాను లోపలికి వెళ్ళిపోయింది. వేదమ్ము వాస్తవాల్ని గమనిస్తూనే వున్నా, నాలోని ఉపాధ్యాయుడి మనస్సు ఎందుకో ముందుకు పొమ్మని తొందర చేయసాగింది.

మా అన్నయ్యని రామనాథంగారిని అడిగి బండి సిద్ధం చేయించమని సరాసరి శివయ్య గారింటికి రమ్మని చెప్పి లేచాను రమ లోపల్నుంచి చెప్పింది – 'అన్నం వండుతాను తిని వెళ్ళండి' అని. 'ఫర్వాలేదులే ఇంత పొద్దుటే ఏం తింటాను' అంటూ పెట్టె తెరిచి డబ్బు తీసుకుని బయటికి నడిచేను. నా వెనగ్గా మా అన్నయ్య కదిలేడు.

శివయ్యగారింటికి వచ్చేశాను. సుభద్రమ్మ బయటి గడపలోనే నిలబెట్టి కంగారు కంగారుగా చెప్పింది, "ఆయనగారికి యములోళ్ళు కనబడుతున్నారట. ఒకటే ఏడుపు. గుండెలు ఎగిరెగిరి పడుతున్నా లబోదిబోమంటున్నాడు" అని.

లోపలికి వెళ్ళాను ఆయన నా రాకని గమనించారు. "రాజా... నాకు భయంగా వుంది రాజా. నేను చావను గాక చావను. తండ్రీ నన్ను రక్షించు...రాజా – నన్ను బతికించు.."

శివయ్యగారిలోని చిన్న పిల్లవాడు చావు భయంతో కంపించి పోతున్నాడు. "ఈయనకి స్పృహ తెలీడం మనకు పెద్ద ప్రమాదంగా వుంది మాష్టారుగారూ. అసలు జబ్బుకంటే ఈ భయం జబ్బు ఆయన్ని కుంగదీస్తోంది. ప్రాణమంటే ఈయన కింత ప్రీతి ఏమిటో" అంటూ వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

– మరో కొద్ది సేపటికి ఎడ్లబండి వచ్చింది. ఊళ్ళో జనమూ మరి కొంత మంది వచ్చారు. బండి బల్లలో గడ్డి పరిచి పైన శాలువా వేశాను. శివయ్యగారిని నేనూ, రామనాథమూ కలిపి బండిలో పరుండబెట్టాం. నాకు సహాయంగా రామనాథమూ బయల్దేరాడు.

బండి సాగింది – జీవితం గురించీ, జగన్నాటకం గురించీ మాట్లాడుతున్నాడు రామనాథం.

బండి డొంకన పడింది. తొన్న చేలమీద వాలిన పిట్టల గుంపుని చూస్తూ అడుగులు వేస్తున్నాను. శివయ్యగారి గురించి వెలువడిన అభిప్రాయాలు నా చెవుల్లో గింగురుమంటు న్నాయి.

'ఆయన పోతే భూదేవికి ఏం మునిగి పోయిందిటా ఇప్పుడు?' – ఆచార్లు.

'ఇప్పుడాయనబతికి ఎవర్ని ఉద్ధరించాలి?' ప్రసిడెంటు.


'ఆ ముసలాయన గురించి మీ ఆందోళన ఏమిటి?' – రమ.

'ప్రాణమంటే ఈయన కింత తీపి ఏమిటో?' – సుభద్రమ్మ

వీళ్ళందరి మాటల్ని – శివయ్యగారికున్న బతకాలనే బలీయమైన ఆశనీ తలచుకుంటుంటే ఆలోచన పీటముడి పడుతోంది.

శివయ్యగారిని హాస్పటల్లో చేర్చాము. అక్కడి డాక్టర్లు ఆయన బతికేదాకా నమ్మకం లేదన్నారు. మర్నాడు వస్తామనిచెప్పి తిరిగొచ్చేసరికీ సాయంకాలమైంది. ఊరిమధ్య దిబ్బమీదికొచ్చాం. దిబ్బమీద రావి చెట్టు. పక్కగా బళ్ళ బాట నేను బండి వెనగ్గా నడుస్తున్నాను.

"చెరువులో ఎడ్లకి నీళ్ళు పెట్టుకుని ఇంటికి పోతాను నువ్వు వెళ్ళు" అన్నాడు రామనాథం. నేను 'సరే' నంటూ నిమ్మళంగా కదిలేను.



## దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం

దురభ్యాసములకు లోనై. దాంపత్యసౌఖ్యంపొందలేనివార్కి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరి బీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్)మూత్ర,స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి

**డా॥ దేవర**

3/1 బ్రాడీపేట, గుంటూరు. (A.P.)



## పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపుపచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు, శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు, లభించును. కోరినవారికి వరలపట్టి పంప బడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

**Shree Jagdamba Bhawan**
**(A.M.) SONEPAT.131001.**



## వెలువడినవి

ప్రసిద్ధ నవలా రచయిత్రి ఆర్. సంధ్యాదేవి "సంసార స్వప్నం" వెల: రు.15-00

బద్దెపూడి సుధారాణి "శిశిర" వెల: రు. 12-00

తారాశంకర బెనర్జీ "మన్వంతరం" వెల: రు. 19-50

పుస్తకాల ధర M.O. పంపినవారికి 25 పైసలు పోస్టేజీకి V.P. పంపుతాము.

**క్వాలిటీ పబ్లిషర్స్, రామమందిరం వీధి, విజయవాడ-2.**







ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర కర్నాటక మరియు గోవాలలో డీలర్ల వద్ద లభించును.

ఉత్పత్తిదారులు :

**హెమ్‌సన్ ఎలెక్ట్రానిక్స్ ఇండస్ట్రీస్ ప్రై. లిమి,**
**4-3-321, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్.**


## ఇది ప్రశ్న—అది జవాబు

కన్ను అదిరింది. ఉలిక్కిపడ్డాను, కళ్ళు నులుముకుని గబగబా అడుగులు వేశాను.

— మా ఇంటిముందు రోదనలూ, ఆక్రందనలు ! గుండెలు అదిరిపోయినై. ఒక్క ఉదుటున గాకిట్లో వాలేను .

మా అన్నయ్య మరి లేడు ! గంట క్రితం గుండె ఆగి చనిపోయాడు !

'వీన్ని నిజాల్లో ఇది వొక నిజం' అన్న మాటని పునశ్చరణ చేసుకోసాగింది మనస్సు !

కర్మాంతరాలైనాయి. అన్నయ్య పోయిన పదమూడో రోజున —

ఆశీర్వచనాలైనాయి. పీటల మీది నుంచీ లేచాను.

"మీ అన్నయ్యని నా చేతుల మీదుగా పంపలేక పోయానే అనే నాకు బాధగా వుంది రాజూ" —

శివయ్యగారి మాటలు నాకు గొలుసు కట్టు రాతలా తోచేయి. ఆయన ముఖం కేసి చూశాను. పగిలిన అద్దంలో వికారి మొహంలా వుంది అది !

శివయ్యగారు ఎవరికోసం, ఎందుకోసం బతికినట్టు ? —

అన్నయ్య ఎవరికోసం, ఎందుకోసం పోయినట్టు ? —

అప్పటి వరకూ కాలానికి కరుణ వుందో లేదో తెల్చుకోలేని నా మనస్సు — క్షణంలో పూవు కంటే తేలిగ్గా అయిపోయింది.

గుండె-లో అరల్లో ఏదో మూల చిన్న దివ్వె వెలిగింది !